ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌టౌన్, ఆగస్టు 28: అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయాధికారులు, బ్యాంకర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రుణమాఫీకి అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. అదే విధంగా రుణమాఫీ కానీ రైతులకు సంబంధించి లోన్ రెన్యూవల్, ఆధార్ నంబర్ల తప్పులను సరి చేసి రుణమాఫీ అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రుణమాఫీ కోసం బ్యాంకుకు వచ్చే రైతుకు రుణమాఫీ వివరాలను ఇవ్వడంతో పాటు సలహాలు, సూచనలు చేయాలన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చేవెళ్ల రూరల్ : కందవాడలో రైతుల పేర్లను నమోదు చేస్తున్న ఏవో శంకర్‌లాల్

ప్రతి బ్యాంకర్ రుణాల జాబితాను తయారు చేయాలని, అందులో రుణమాఫీ ఎంత మంది రైతులకు అయింది, రుణమాఫీ కానీ వారి జాబితాను తయారు చేసి అర్హులైన వారికి రుణమాఫీ అయ్యే విధంగా చూడాలన్నారు. రుణమాఫీ వర్తించని రైతుల వివరాల నమోదుకు ప్రభుత్వం రైతు భరోసా పంట రుణమాఫీ యాప్ రూపొందించడం జరిగిందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా రుణమాఫీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ రాజారత్నం, మాజీ జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, నాయకులు బాల్‌రాజు, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

చేవెళ్ల రూరల్ : మూడు విడుతల్లో రుణాలు మాఫీ కాని రైతులు ఎవరూ ఆందోళన చెందనవసరం లేదని అర్హులందరికీ మాఫీ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారి శంకర్ లాల్ అన్నారు. బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని కందవాడ, పల్గుట్ట గ్రామాల్లో రుణమాఫీ కాని రైతుల జాబితాను పరిశీలించి వారి కుటుంబ సభ్యుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రిను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. రైతులు తమ కుటుంబ సభ్యుల పేర్లు, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు సహకరించాలని కోరారు. వ్యవసాయ అధికారి వెంట ఏఈవో స్వాతిప్రియ, రైతులు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఇంటింటికీ సర్వే

మంచాల : నేటి నుంచి మంచాల మండలం వివిధ గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు రేషన్ కార్డుతో సంబంధం లేకుండా పంటరుణ మాఫీపై ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంచాల వ్యవసాయ శాఖ అధికారి మాధవీలత బుధవారం తెలిపారు. ఈనెల 29న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు బండలేమూరు, 30న లింగంపల్లి, 31న చిత్తాపూర్ సెప్టెంబర్ 2న తాళ్లపల్లిగూడ, 3న తిప్పాయిగూడ, 4న నోముల, 5న ఆగపల్లి, 6న కాగజ్‌ఘట్, 9న అస్మత్‌పూర్, 10న రంగాపూర్, 11న పీసీ తండా,12న జాపాల, 13న దాద్‌పత్తి, 17న చీదేడు, 18న చెన్నారెడ్డిగూడ, 19న సత్తితండా, 20న కొర్రవాని తండా, 21న ఎల్లమ్మతండా, 23న బోడకొండ, 24న లోయపల్లి, 25న ఆంబోత్‌తండా, 26న ఆరుట్లలో ఏవోలు ఇంటింటా తిరుగుతూ పంటరుణమాఫీ కానీ రైతుల కుటుంబ సభ్యుల వివరాలను యాప్‌లో నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జోనల్‌స్థాయి ఫ్రీడం కప్ క్రికెట్ టోర్నమెంట్

చేవెళ్ల రూరల్, ఆగస్టు 28 : శంకర్‌పల్లి మండల పరిధి జన్వాడ గ్రామంలో జోనల్ స్థాయి ఫ్రీడం కప్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఇందులో చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ మండలాలకు సంబంధించిన మూడు టీంలు పోటీ పడ్డాయి. బుధవారం ఫైనల్‌లో శంకర్‌పల్లి తెలంగాణ మాడల్ స్కూల్, షాబాద్ హోలీ స్పిరిట్ పాఠశాల క్రికెట్ టీంలు ఆడగా షాబాద్ హోలీ స్పిరిట్ పాఠశాల టీం ఫైనల్‌లో గెలిచింది. ఈ సందర్భంగా విజేత టీం సభ్యులకు షీల్డ్, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి తెలంగాణ మాడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మహేశ్వరరావు, జోనల్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ సెక్రటరీ ప్రభాకర్, ఫిజికల్ డైరెక్టర్లు రాఘవేందర్ రెడ్డి, బసవరాజ్, అరుంధతి, బాబయ్య, ఉపాధ్యాయులు సంతోష్‌వేముల, శివపత్రీక్ పాల్గొన్నారు.

చేవెళ్ల బస్టాండ్‌లో దొంగల చేతివాటం

చేవెళ్లటౌన్, ఆగస్టు 28: చేవెళ్ల బస్టాండ్‌లో దొంగలు రూ. 40వేలు దొంగలించిన ఘటన చేవెళ్లలో బుధవారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. చేవెళ్ల మండలంలోని ఊరెళ్ల గ్రామానికి చెందిన యాదయ్య చేవెళ్ల బస్టాండులో బస్సు ఎక్కుతుండా గుర్తు తెలియని దుండగులు అతడి ప్యాంటు జేబులోంచి రూ.40 వేలు దొంగలించారు. ఈ విషయమై బస్సుస్టాండ్‌లో పోలీసులు గస్తి నిర్వహించి దొంగలను పట్టుకోవాలని బాధితుడు కోరాడు.

తాగునీటి సరఫరా చేయాలి

ఇబ్రహీంపట్నంరూరల్, ఆగస్టు 28 : మండల పరిధిలోని రాయపోల్ గ్రామానికి 25రోజులుగా తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాయపోల్ మాజీ సర్పంచ్ గంగిరెడ్డి బల్వంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం ఎంపీడీవో వెంకటమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బల్వంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సక్రమంగా నీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నందున వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.

కామ్రేడ్ ఈశ్వరప్పకు ఘన నివాళి

మంచాల, ఆగస్టు 28: మంచాల మండలం జాపాల గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు కామ్రేడ్ ఈశ్వరప్ప 27వ వర్ధంతి సందర్భంగా బుధవారం సాయంత్రం సీపీఎం నాయకులు, అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామంలో సీపీఎం అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన కుమారుడు బకున మల్లప్పతో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

కడ్తాల్, ఆగస్టు 28: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు క్రీడా సామగ్రి కోసం ఆయన రూ.11వేలు నగదును ఉపాధ్యాయులకు అందజేశారు. అనంతరం గోపాల్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం స్వరూప, మాజీ ఎంపీటీసీ రంగయ్య, నాయకులు బీరప్ప, శ్రీశైలం, కృష్ణయ్య, యాదయ్య, సాయికుమార్, పీడీ సాబేర్, ఉపాధ్యాయులు అశోక్, సతీశ్, రమేశ్, మంజుల, వినోద్, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ఇబ్రహీంపట్నంరూరల్, ఆగస్టు 28 : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కళాశాల చైర్మన్ నాగయ్య అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ సత్యనారాయణ, కళాశాల సెక్రటరీ ప్రదీప్, ప్రిన్సిపల్ శేఖర్‌బాబు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

దివ్యాంగులపై ప్రభుత్వం చిన్నచూపు

పెద్దఅంబర్‌పేట, ఆగస్టు 28: దివ్యాంగులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలిమండ్ల గోవర్ధన్ అన్నారు. బుధవారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి 18వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ.. దివ్యాంగులకు రూ.6 వేలు పెన్షన్ ఇస్తామని చెప్పి ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపులో వారికి ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

పట్నంలో వీహెచ్‌పీఎస్ జెండావిష్కరణ

ఇబ్రహీంపట్నం : దివ్యాంగుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నట్లు దివ్యాంగుల హక్కుల పోరాట సమితి (వీఎచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య అన్నారు. వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఇబ్రహీంపట్నంలో వీహెచ్‌పీఎస్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొండ్రు ప్రవీణ్, కృష్ణ, వీహెచ్‌పీఎస్ నాయకులు శ్రీనివాస్, యాదయ్య, బాలరాజు, సంజీవ, సురేశ్, లింగమయ్య తదితరులున్నారు.

ఇబ్రహీంపట్నం : జెండాను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

పెద్దఅంబర్‌పేట : వీహెచ్‌పీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

మాల్‌లో..

యాచారం : మండలంలోని మాల్ మార్కెట్‌లో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు డేరంగుల ఈశ్వర్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మహ్మద్ సలీం మాట్లాడుతూ..ఎన్నికల ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీ ప్రకారం ఆసరా పింఛన్‌ను రూ.6వేలకు వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. పింఛన్ పెంచేవరకు వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిరంతరం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు పోషయ్య, మాజీ సర్పంచ్ జంగయ్య, నాయకులు శేఖర్‌గౌడ్, గాలయ్య, గుండ్లపల్లి మురళి, శ్రీను, లింగం, తిరుమలేశ్, చందర్, బాలకృష్ణ, నర్సింహాచారి పాల్గొన్నారు.

మంచాలలో సీజనల్ వ్యాధులపై అధికారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

మంచాల, ఆగస్టు 28: సీజనల్ వ్యాధులపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని మంచాల ఎంపీడీవో బాలశంకర్ అన్నారు. బుధవారం మంచాల ఎంపీడీవో కార్యాయంలో వైద్య, గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో డెంగీ, మలేరియాతో పాటు ఇతర సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి

మాసాబ్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధా

తుర్కయాంజాల్, ఆగస్టు 28: మున్సిపాలిటీ పరిధి మాసాబ్ చెరువులో గణపతి ప్రతిమల నిమజ్జన ఏర్పాట్లను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధా, కమిషనర్ అమరేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని అన్నారు. ఇరిగేషన్, పోలీస్, ట్రాఫిక్, ఆర్‌అండ్‌బీ అధికారులు, ఫిషరీష్, ఫారెస్ట్ అధికారులు సమన్వయంతో పని చేసి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశికె అయిలయ్య, కౌన్సిలర్లు రవీందర్‌రెడ్డి, కుంట ఉదయశ్రీ, ఏతః భిక్షపతి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, హరీశ్, నాయకులు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్ పాసుల పంపిణీ

తుర్కయాంజాల్, ఆగస్టు 28: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా బస్ పాస్‌లను అందజేయడం సంతోషంగా ఉందని తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ, తుర్కయాంజాల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత బస్ పాసులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మర్రి మహేందర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతి, ఆర్టీసీ డీఎం వెంకట నర్సప్ప పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కడ్తాల్, ఆగస్టు 28: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణ, యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉట్టు కొట్టిన యువకుడికి మాజీ ఎంపీటీసీ గోపాల్ రూ.వేయి అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు గోపిక, కృష్ణుడి వేషధారణలతో ఆకట్టుకున్నారు. మన ఆచారాలు, సంప్రదాయాలను నేటితరం యువతకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్కకులు రాములు, మురళీ, మాజీ ఎంపీటీసీ రంగయ్య, నాయకులు బీరప్ప, కృష్ణయ్య, యాదయ్య, రమేశ్, శ్రీశైలం, కుమార్, మధు పాల్గొన్నారు.

విషజ్వరాలతో అప్రమత్తంగా ఉండాలి

కడ్తాల్ (తలకొండపల్లి), ఆగస్టు 28: ఉచిత వైద్య శిబిరంలో ఎంతో మందికి వైద్య పరీక్షలు చేసినట్లు ట్రస్ట్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. బుధవారం తలకొండపల్లి మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్ గ్రామంలో... ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆమనగల్లు, కామినేని దవాఖాన సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ వానకాలంలో వచ్చే విష జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వైద్యులు సూచనలు, సలహాలను ప్రజలు పాటించాలని పేర్కొన్నారు. వైద్యులు అఖిల్, అనిల్ ఆధ్వర్యంలో 236 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సభ్యులు నర్సింహారెడ్డి, రమేశ్ బాబు, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మోహన్‌రెడ్డి, ఓంకారం, మాజీ సర్పంచ్‌లు రమేశ్‌యాదవ్, రఘురాములు, ఈశ్వర్‌నాయక్, వెంకటయ్య, నాయకులు దశరథం, అశోక్‌గౌడ్, రామునాయక్, రాజు, జహంగీర్, ఆసద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేశ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవి

కడ్తాల్, ఆగస్టు 28: దేశ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని రాష్ట్రపతి అవార్డు గ్రహీత, డాక్టర్ దీక్షితుల సుబ్రమణ్యం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సాయి మందిరంలో లలితా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీశక్తి లలితాంబిక భక్త బృందం ఆధ్వర్యంలో గోపూజ, గణపతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్షితుల సుబ్రమణ్యం మాట్లాడుతూ ఆధ్మాత్మిక, ధార్మిక కార్యక్రమాలతో సమాజంలో శాంతి వెల్లివిరుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఆయనను నాయకులు, నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు జ్ఞానప్రసూనశర్మ, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, నాయకులు మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీరాములు, నారాయణ, రాఘవచారి, శ్రీనివాస్, భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఆలయంలో సంకీర్తనలు ఆలపిస్తున్న రాష్ట్రపతి పురస్కార గ్రహీత, దీక్షితుల సుబ్రమణ్యం

మల్లప్ప, బీరప్ప ఆలయాలకు భూమిపూజ

ఆమనగల్లు : ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని బీఆర్ఎస్ యువ నాయకుడు శేఖర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లిలో బుధవారం గొల్ల కురుమ కుల సంఘం ఆధ్వర్యంలో మల్లప్ప,బీరప్ప దేవాలయాలకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గొల్ల కురుమ నాయకులు నారమోని తిరుమలేశ్, ఆంజనేయులు, రాకేశ్, శ్రీనివాస్, మహేశ్, జంగయ్య పాల్గొన్నారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

కడ్తాల్ (తలకొండపల్లి) : ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన పోచమ్మతల్లి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆయన స్థానిక నాయకులతో పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్యోతయ్య, నాయకులు జగతయ్య, యాదయ్య, సాయిలు, మల్లేశ్, నర్సింహ, రమేశ్, రవి, దశరథం, చిన్నా, కుమార్, శ్రీశైలం, భక్తజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కడ్తాల్ (తలకొండపల్లి), ఆగస్టు 28: మండల పరిధిలోని గాన్గుమార్లతండా గ్రామ పంచాయతీలోని పోచమ్మగడ్డ తండాకు చెందిన జర్పుల శాంతి కుమార్తె గీత వివాహానికి, బుధవారం రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ తరుపున మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్-శారద దంపతులు రూ.25 వేలతోపాటు సారెను అందజేశారు. వారి వెంట నాయకులు శంకర్, కిషన్, జగన్, వినోద్, చిత్ర, లక్ష్మీ, సోనా, లాలీ, అనిత, కవిత తండావాసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మంచాల, ఆగస్టు 28: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మంచాల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కాగజ్‌ఘట్ గ్రామానికి చెందిన సీహెచ్ఎస్ శ్రవణ్‌కుమార్(26) ఆరుట్లలో జరిగిన బంధువుల వివాహానికి హాజరై తిరిగి రాత్రి సమయంలో మోటర్ సైకిల్‌పై కాగజ్‌ఘట్ గ్రామానికి వెళ్తుండగా కారును మోటర్ సైకిల్ ఢీకొట్టడంతో శ్రవణ్‌కుమార్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే చికిత్స కోసం 108అంబులెన్స్‌లో ఇబ్రహీంపట్నానికి తరలిస్తుండగానే మార్గమధ్యంలో మృతి చెందినట్లు చెప్పారు. పోస్టుమార్టం కోసం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

శ్రవణ్‌కుమార్ (ఫైల్)

తహసీల్దార్ రవీందర్‌దత్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

పెద్దఅంబర్‌పేట, ఆగస్టు 28: క్రషర్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకులు కోరారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గౌరెల్లి గ్రామ పరిధిలోని ఏడున్నర ఎకరాల భూమిని లీజుకు తీసుకున్న ఓ క్రషర్ కంపెనీ 2011లోనే లీజు గడువు పూర్తయినా డస్ట్, కంకర, రాళ్లను అమ్ముకుని కోట్లు సంపాదిస్తున్నారని యాజమాన్యానికి జరిమానా విధించాలని విన్నవించారు. వారి ఆధీనంలోని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం మండల తహసీల్దార్ రవీందర్‌దత్‌కు ఫిర్యాదు చేసినట్లు బీఎస్పీ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు గ్యార మల్లేశ్ తెలిపారు. ఆయన వెంట కృష్ణ, ధన్‌రాజ్, చిరంజీవి ఉన్నారు.

గుంతల పూడ్చివేత

చేవెళ్లటౌన్, ఆగస్టు 28: చేవెళ్లలో హైదరాబాద్ -బీజాపూర్ రహదారిపై వర్షానికి గుంతలు పడి ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి చేవెళ్ల గ్రామానికి చెందిన గుత్తి మల్లేష్, బండారి శ్రీకాంత్ రెడ్డి, నరేష్ సిమెంట్, కంకరతో గుంతలను పూడ్చివేశారు.

దొంగలతో అప్రమత్తంగా ఉండాలి

యాచారం, ఆగస్టు28: దొంగలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం సైకిల్ పెట్రోలింగ్ నిర్వహించారు. దొంగతనాలపై మహిళలు, విద్యార్థులు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేజర్ గ్రామ పంచాయతీల్లో నిర్వహించే సంతలు, రద్దీగా ఉండే ప్రాంతాలు, బస్తాండ్లలో దొంగలు చోరీలకు పాల్పడుతున్న తెలిపారు. అలాంటి ప్రదేశాల్లో దొంగలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నా వెంటనే 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య

ఆదిబట్ల, ఆగస్టు 28: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో ఓ వెంచర్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకన్న ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని జిల్లేల్‌గూడకు చెందిన సిద్దిపేట ప్రభాకర్‌రెడ్డి (50) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. ఇంటి నుంచి తన స్కూటీపై బయటికి వెళ్లాడు. ఆదిబట్ల నుంచి నాదర్‌గుల్ వెళ్లే దారిలో ఉన్న ఓ వెంచర్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని మృతి చెందిన వ్యక్తి సిద్దిపేట ప్రభాకర్‌రెడ్డిగా గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు

ఇబ్రహీంపట్నంరూరల్, ఆగస్టు 28 : మండల పరిధిలోని రాయపోల్ గ్రామంలో సూర్యోదయ కాలనీ వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరువ చూపించి నిధులు మంజూరు చేయించటం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం అధ్యక్షుడు మంఖాల కరుణాకర్ అన్నారు. డీఎంఎఫ్‌టీ గ్రాంట్ నిధుల నుంచి కేటాయించిన రూ.15లక్షలతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు.